క్లుప్తంగా

ఆడపిల్లలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు



ప్రత్తిపాడు: ఆడపిల్లలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు ఉన్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్. భారతి అన్నారు. భేటి బచావో- భేటి పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం గొట్టిపాడు సెక్టార్‌లోని తిక్కిరెడ్డి పాలెం జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రత్తిపాడు సెక్టారులోని చినకోండ్రుపాడు డీడబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హైస్కూల్లో కిశోర బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, రుతుక్రమం సమయంలో పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రతలపై సూపర్‌వైజర్ పి.మాధవి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు బాల్య వివాహాలు, వాటి వలన ఎదురయ్యే అనర్థాలు, బాలికల చదువు, లింగవివక్షలపై సూపర్‌వైజర్ ఎస్.భారతి వివరించారు.

యోగాసనాలతో ఆరోగ్యం పటిష్టం



గుంటూరు రూరల్: యోగాసనాలతో ఆరోగ్యం పటిష్టంగా మారుతుందని శ్రీ సాయి యోగా విద్యాపీఠం యోగాచార్య భైసు మల్లికార్జునరావు తెలిపారు. శనివారం నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు యోగాసనాలు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాచార్య విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ విద్యార్థి దశలో యోగా చేయటం వల్ల వారిలో సృజనాత్మకత, జ్ఞాపకశక్తి, సొంతగా నిర్ణయం తీసుకునే శక్తి లభిస్తుందన్నారు. అనంతరం అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.

దంత పరిరక్షణతో ఆరోగ్యం



పొన్నూరు: దంత పరిరక్షణే ఆరోగ్యానికి పునాది లాంటిదని సిబార్ డెంటల్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ ఎస్.చైతన్య మోహన్ అన్నారు. శనివారం మండలంలోని మామిళ్లపల్లి గ్రామం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు దంతలు ఎలా శుభ్రం చేసుకోవాలి, సమస్యలు రాగానే ఏంచేయాలనే విషయాలను వైద్యులు సౌమ్య, దివ్య, కీర్తి, రమ్య, మల్లేశ్వరి, పద్మావతి, గాయత్రి, సివెంజ్, ఆశ్రిత వివరించారు. విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, దంత సమస్యలను గుర్తించిన వారికి ఉచిత ఓపీ క్యాంప్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.బాలస్వామి, డాక్టర్ సిహెచ్.రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా లక్ష్మణరావుని గెలిపించుకుందాం



పెదకాకాని: ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రజా సంఘాలు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ అన్నారు. మండల కేంద్రమైన పెదకాకానిలోని సుందరయ్య కాలనీలో శనివారం పలు సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ తరపున కార్యకర్తలకి లబ్ధి చేస్తున్నారని అధికారంలో ఉన్న లేకపోయినా ఉద్యోగ ఉపాధ్యాయ, అధ్యాపక, పెన్షనర్లు, నిరుద్యోగ, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పోరాడి వారి సమస్యలను పరిష్కరించిన వ్యక్తి కేఎస్ లక్ష్మణరావు అని అన్నారు. పొన్నూరు నియోజకవర్గ సీఐటీయూ కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ అధికార ధన బలానికి లొంగకుండా ప్రజాబలం ఉన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావుని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రంగారావు, బాజీబాబు, గంగాధర్, నరసింహారావు, పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు అవమానం

కాకుమాను: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిందని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు వెలగా గంగాధర్ అన్నారు. పెదనందిపాడు మండలంలోని వరగానిలో శనివారం అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



ప్రత్తిపాడు హైస్కూల్లో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న తహసీల్దార్ కరుణకుమార్



ఎన్జీరంగా వర్సిటీలో ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న విశ్వవిద్యాలయం అధికారులు



కాకుమానులో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి



నంబూరు వీవీఐటీలో మాట్లాడుతున్న డాక్టర్ సమరం, కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

ప్రత్తిపాడు: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమైనదని తహసీల్దార్ జీ.కరుణకుమార్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం సీనియర్ ఓటర్లను దుశ్శాలువాలతో సత్కరించారు. తదనంతరం సచివాలయ ఉద్యోగులు, బీఎల్‌ఓలతో కలసి ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ యువత ఓటు హక్కు విలువను తెలుసుకోవాలన్నారు. ఓటు లేని పద్దెనిమిది సంవత్సరాలు నిండిన యువతీ యువకులు నూతనంగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చెసుకోవాలని కోరారు. అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ ఉన్న భారత్ లో ఓటుకు ఎంతో ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువ చైతన్యం.. దేశ భవితకు శ్రీకారం

పొన్నూరు: ఉత్తమ పాలకులను ఎన్నుకునేందుకు, భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ఓటు ప్రధాన అస్త్రమని నియోజకవర్గ ఈఆర్‌ఓ టీవీ విజయలక్ష్మి అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారిలో ఓటు ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలపై యువకులలో ఆసక్తిని పెంచేందుకు, 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు పొందేలా, ఓటు వేసేలా ప్రోత్సహించేందుకు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు. కుల, మత, వర్గాల వివక్ష లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేందుకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చిందన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. కార్యక్రమంలో టీపీఎస్ రఘురామ్, ఆర్ఐ శ్రీనివాస్, మున్సిపల్ ఆర్‌ఓ తోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పొన్నూరులో ర్యాలీని ప్రారంభిస్తున్న ఈఆర్‌ఓ విజయలక్ష్మి

ఓటు హక్కు వజ్రాయుధంతో సమానం

కాకుమాను: ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఓటుహక్కు గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కె.ఎఫ్.కెనడీ, కె.విజయ్ భాస్కర్, హెచ్‌ఎం బి.సత్యం పాల్గొన్నారు.

సమర్థ నాయకుల ఎంపికలో యువ ఓటర్లు కీలకం

పెదకాకాని: భవ్యమైన దివ్యమైన భారత నిర్మాణంలో సమర్థవంతమైన నాయకుల ఎంపికలో యువ ఓటర్లు కీలకమని , యువత తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పూర్వ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి.సమరం కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నంబూరు వీవీఐటీ, జనచైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవం శనివారం నిర్వహించారు. సభకు జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ సమరం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటర్లే యజమానులని పాలకులు సేవకులుగా మాత్రమే పనిచేయాలన్నారు. బ్రిటిష్ పాలన అవశేషాలు ఇంకా దేశంలో మిగిలి ఉన్నాయని, అవి తొలగిపోవాలంటే అవగాహనతో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆర్థిక, రాజకీయ అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలలో డబ్బు, మద్యం పాత్ర లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఐఎల్ జె. భక్తా సింగ్ పాల్గొన్నారు.

ఎన్జీరంగా వర్సిటీలో..

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు ఓటు ప్రాధాన్యత గురించి తెలిపారు. ఓటు ద్వారా సమజాభివృద్ధికి అవసరమైన నాయకుడిని ఎన్నుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విద్యార్థులు అధ్యాపకులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీజీ స్టడీస్ డీన్ డాక్టర ఏవీ రమణ, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ బీ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

చిన్న వయస్సు నుంచే దానం గుణం అలవరుచుకోవాలి

కాకుమాను: చిన్న వయస్సు నుంచే ప్రతి విద్యార్థి దానగుణం అలవరుచుకుని ఇబ్బందుల్లో ఉన్న వారికి దానం చేయాలని పాఠశాల కరస్పాండెంట్ ముద్దన నాగరాజ కుమారి అన్నారు. పెదనందిపాడు లయన్స్ మాంటిస్సోరీ పాఠశాల విద్యార్థులు వృద్ధుల కోసం సేకరించిన బియ్యాన్ని శనివారం మండలంలోని అడుసుమిల్లి శబరి ఓల్డేజ్ హోంకు అందజేశారు. ఈసందర్భంగా నాగరాజ కుమారి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం చిన్న వయస్సు నుండే అలవరుచుకుని పేద పట్ల సానుభూతి చూపేలా తల్లి దండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా నేర్పించాలని ఆమె తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు తీసుకువచ్చిన 1.70 క్వింటాళ్ల బియ్యాన్ని శబరి ఓల్డ్ ఏజ్ హోంకు సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు దాసరి శేషగిరిరావు, ప్రిన్సిపాల్ కిరణ్ జోష్ పాల్గొన్నారు.



విద్యార్థులు తీసుకువచ్చిన బియ్యాన్ని ఓల్డేజ్ హోం సభ్యులకు అందజేస్తున్న పాఠశాల సిబ్బంది

ఆర్‌వీఆర్‌జేసీని సందర్శించిన టీసీఎస్ బృందం

గుంటూరు రూరల్: కంపెనీల అవసరాలకు అనుగుణంగా సాంకేతికతలో నైపుణ్యాలను వృద్ధి చేసుకుంటూ విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలని టీసీఎస్ వైస్ ప్రెసిడెంట్, టెక్నాలజీ, సాఫ్ట్ వేర్ సర్వీసెస్ 4.0 బిజినెస్ యూనిట్ హెడ్ జయరామకృష్ణ నూతులపాటి తెలిపారు. శనివారం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలను ప్రముఖ అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీ టీసీఎస్ ఉన్నత అధికారుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యావసతి సౌకర్యాలను, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను, కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంక్యూబేషన్ సెంటర్ పరిశీలించారు. జయరామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత ఇండస్ట్రీ 4.0 దిశగా పారిశ్రామిక ప్రక్రియ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మిళితమై ఉందన్నారు. భారత దేశాన్ని గ్రీన్ ఎనర్జీగా మార్చే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమానికి తమ వంతు తోడ్పాటును అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, టీసీఎస్ హైదరాబాద్ జనరల్ మేనేజర్ హెచ్‌ఆర్ అండ్ రీజినల్ హెడ్ హ్యూమన్ రిసోర్సెస్, శ్రీకాంత్ సూరంపూడి, రీజియన్ హెడ్ అకాడమిక్ అలియాన్సెస్ రిచార్డ్ కింగ్ చాట్రగడ్డ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను పరిశీలిస్తున్న టీసీఎస్ ఉన్నతాధికారుల బృందం

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి వైస్ చాన్సలర్ కె.గంగాధరరావు, రెక్టార్ కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ భారత దేశ సామాజిక, రాజకీయ, పాలనా రంగాలలో ఆదర్శవంతమైన పాత్ర పోషించిన బాబూ జగ్జీవన్‌రామ్ ఆలోచనా అంశాలపై జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. సదస్సు డైరెక్టర్, బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయనకేంద్రం డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ మాట్లాడుతూ మార్చి 14, 15 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సులో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ చింతికింది కాశీం కీలకోపన్యాసం చేస్తారన్నారు. పరిశోధనా పత్రాలు సమర్పించాలనుకునే వారు ఫిబ్రవరి 25వ తేదీలోగా తమ అబ్‌స్ట్రాక్ట్‌లను పంపాలని, పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, అంబేడ్కర్, పూలే అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లు వై.అశోక్ కుమార్, ఎం.త్రిమూర్తిరావు, డాక్టర్ రాజశేఖర్, అభిషేక్, కుటుంబరావు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ గంగాధరరావు, రెక్టార్ రత్నషీలామణి, రిజిస్ట్రార్ సింహాచలం

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఎంపీపీ భవనం పద్మలీల

పొన్నూరు: మండల పరిధిలోని గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని ఎంపీపీ భవనం పద్మలీల అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభకు ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడారు. రానున్న వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చేయాలని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఎంపీటీసీలు, సర్పంచులు తెలియజేసే సమస్యలను పరిగణనలోకి తీసుకుని పరిష్కారం దిశగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలను వివిధ శాఖల అధికారులు వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ అంబటి రాఘవయ్య, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, హౌసింగ్ ఏఈ జాని బాషా, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మలీల

యువ ఇంజినీర్లు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

హ్యాచ్ ల్యాబ్ సీఈఓ డాక్టర్ రాజశేఖర్

ప్రత్తిపాడు: యువ ఇంజినీర్లు భవిష్యత్‌లో వ్యాపారవేత్తలుగా ఎదగాలని, అందుకు విద్యార్థి దశ నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని హ్యాచ్ ల్యాబ్ సీఈఓ డాక్టర్ కె.రాజశేఖర్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ విభాగంలో శనివారం ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్ షిప్ బూట్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హ్యాచ్ ల్యాబ్ సీఈఓ డాక్టర్ కె.రాజశేఖర్, ఏపీఐఆర్ స్క్వేర్ ఫౌండర్ సీఈఓ రత్నాకరం గోపాలకృష్ణ రిసోర్స్‌పర్సన్‌లుగా వ్యవహరించారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగావకాశాలు పొందే స్థాయిలో కాకుండా, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, విభాగాధిపతి డాక్టర్ బి.భానుప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హ్యాచ్ ల్యాబ్ సీఈఓ రాజశేఖర్

ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం

పొన్నూరు: పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్న ఆర్ఎంపీలు, పీఎంపీలు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.రాజా సిద్ధార్థ అన్నారు. శనివారం పట్టణంలోని ఒక కల్యాణ మండపంలో అసోసియేషన్ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజా సిద్ధార్థ, డాక్టర్ సజ్జా రవీంద్రబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు యలమందరావు, కార్యదర్శి రవిచంద్రారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్‌పీ రాజేంద్రప్రసాద్, గౌరవాధ్యక్షుడు ఎంపీ మోహనరావు పాల్గొన్నారు.



‘రైతు సేవ’లకు తాళం



నడింపాలెంలో శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకు తాళాలు వేసి ఉన్న రైతు సేవ కేంద్రం



దుమ్ముకొట్టుకుపోయిన కియోస్క్ మిషన్

‘రైతు సేవ’ కేంద్రాల నిర్వహణ ఇష్టారాజ్యంగా తయారయ్యింది. అడిగే నాథుడు కరువవ్వడంతో కేంద్రాలు ఎప్పుడు తెరిచి ఉంటాయో, సిబ్బంది ఏ సమయంలో అందుబాటులో ఉంటారో తెలియని దుస్థితి. అందుకు నిదర్శనమే ఇక్కడ కనిపిస్తున్న ఈ చిత్రాలు.

– ప్రత్తిపాడు

డ్రైవర్లు ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండాలి

ఎంవీఐ రాఘవరావు



పెదకాకాని: వాహనాలు నడుపే సమయంలో డ్రైవర్లు ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు అన్నారు. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శనివారం గుంటూరు జిల్లా రవాణా శాఖ అధ్వర్యంలో రహదారి భద్రత మాసోత్సవాలు 2025 భాగంగా జిల్లాలోని పలు కళాశాలల బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాఘవరావు మాట్లాడుతూ రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. రోడ్లకు ఎడమ వైపు మాత్రమే వాహనాలు నిలపాలన్నారు. యాజమాన్యాలు డ్రైవర్లకు ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రోడ్డుపైకి వచ్చే వాహనాలకు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని రోడ్డు భద్రత వారోత్సవాలు మనందరి మంచికోరి రవాణా శాఖ నిర్వహిస్తోందని వివరించారు. రవాణా శాఖ అందించే సూచనలు డ్రైవర్లు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని హెచ్చరించారు. అనంతరం డ్రైవర్లతో రోడ్డు నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు కె.మల్లీశ్వరి, ఎ.సంధ్య, జి.సౌజన్య, వీవీఐటీ ట్రాన్స్‌పోర్ట్ కన్వీనర్ పీవీ సురేంద్రమోహన్‌కుమార్, ఎల్.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ప్రతిభ



చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలో ప్రతిభ కనబరిచి బహుమతి సాధించటంతో పాటు జిల్లా కలెక్టర్ నుంచి అభినందనలు పొందినట్లు హెచ్‌ఎం ఎం ఏడుకొండలు శనివారం తెలిపారు. నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని ఎం.బావన గుంటూరు పరీక్షా భవన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి స్లోగన్స్ పోటీలో ప్రతిభ కనబరిచింది. ‘ఓటరే దేశానికి రారాజు’ స్లోగన్‌కు తృతీయ బహుమతి సాధించటంతో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి నుంచి ప్రశంసలు అందుకున్నారు. డీఈఓ సీవీ రేణుక తదితరులు విద్యార్థిని బావనతో పాటు గైడ్ టీచర్ రాజ్యలక్ష్మి, హెచ్‌ఎం ఎం ఏడుకొండలు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

‘ఎంహెచ్‌ఆర్‌డీ’ను పరిశీలించిన పీఎఫ్‌ఎంఎస్ ప్రతినిధులు



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫిజిక్స్ విభాగంలో నిర్వహిస్తున్న ఎంహెచ్‌ఆర్‌డీ ల్యాబ్‌ను పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్మెంట్ సిస్టం(పీఎఫ్ఎం ఎస్)కు చెందిన ప్రతినిధులు నితీష్ కుమార్, దివ్యాన్స్ శనివారం సందర్శించారు. ఎం.హెచ్.ఆర్.డి ప్రాజెక్టులో భాగంగా నిధి స్కీమ్ కింద ఫిజిక్స్ విభాగం ఎంహెచ్‌ఆర్‌డీ ల్యాబ్‌ను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ప్రాజెక్టు ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్, ఓఎస్‌డీ ఆర్‌వీఎస్‌ఎస్ఎన్ రవికుమార్, వివరాలను సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా వీసీ కె.గంగాధర రావు, రెక్టార్ కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎం.హెచ్.ఆర్.డి ప్రాజెక్టు విజయవంతంగా పూర్తి చేసేందుకు విశ్వవిద్యాలయం కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ రవికుమార్, కో ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ సంధ్య కోలేలను అభినందించారు.

ఘనంగా ప్రార్థనా మందిరం ప్రతిష్టా ఆరాధన



చేబ్రోలు: చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన ద్రాక్షావల్లి ప్రార్థనా మందిరం ప్రతిష్టా ఆరాధన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని నారాకోడూరులో తెలుగు బాపిస్టు సంఘం వారు నిర్మించిన నూతన మందిర ప్రతిష్టా కార్యక్రమం వైభవంగా చేపట్టారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమంలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొన్నారు. వేజండ్లలోని ద్రాక్షావల్లి ప్రార్థనా మందిరం ఆరాధన కార్యక్రమంలో కత్తెర సురేష్ కుమార్, కూచిపూడి రవిశేఖర్ పాల్గొన్నారు.

లారీ ఢీ కొని మహిళకు తీవ్రగాయాలు

పెదకాకాని: లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా అతి వేగంగా వాహనం నడిపి మహిళను ఢీ కొనడంతో తీవ్రగాయాలయ్యాయి. పెదకాకాని సుందరయ్యకాలనీకి చెందిన మూర్ల వెంకటేశ్వర్లు సమీపంలోని దక్కన్ టుబాకో కంపెనీలో వర్కర్‌గా పనిచేస్తుంటాడు. ఎప్పటి మాదిరిగానే శనివారం పనికి వెళ్లిన భర్తకు భోజనం క్యారేజ్ ఇచ్చేందుకు భార్య సూరమ్మ కంపెనీ వద్దకు నడిచి వెళ్తోంది. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీ కొనడంతో సూరమ్మ రెండు కాళ్లు విరిగిపోయాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.